ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

బుధవారం 6 ఆగస్టు 2025

బెంగళూరు ఎన్నికలపై.. జాప్యమెందుకో..?



- వారంలోగా నియమాలు రూపొందించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచన

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ను 'గ్రేటర్ బెంగళూరు ప్రాధికార' (జీబీఏ)గా రాష్ట్రప్రభుత్వం మార్చింది. జీబీఏను ఐదు పాలికేలుగా విభజించి పాలన చేయాలని భావించారు. జీబీఏ పూర్తిస్థాయిలో అమలయ్యేలంతవరకు బీబీఎంపీ కొనసాగుతుందని తీర్మానించారు. కాగా బీబీఎంపీకి ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరుణంలో వారంలోగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన నియమాలను అందుబాటులోకి తేవాలని రాష్ట్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం మార్గదర్శకం చేసింది. పాలికెకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సమర్పించిన అర్జీపై న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యాల ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్రప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొన్నట్టుగా షెడ్యూల్‌ను పాటించాలని హెచ్చరించింది. నవంబరు 1లోగా వార్డుల విభజన, గెజిట్ నోటిఫికేషన్ విడుదల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు నవంబరు 3కు తదుపరి విచారణకు వాయిదా వేసింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి, అడ్వకేట్ జనరల్ శశికిరణ్‌శెట్టి, అదనపు అడ్వకేట్ జనరల్ నిశాంత్ పాటిల్, న్యాయవాది డీఎల్ చిదానంద్ పాల్గొన్నారు.

● అర్జీదారుడి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తాగి, సిద్ధార్థదేవ్ పాల్గొన్నారు. వారు వాదనలు వినిపిస్తూ పాలికె ఎన్నికలు జరిగి పదేళ్లు అవుతోందని, రాష్ట్రప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ప్రభుత్వానికి సమగ్రమైన మార్గదర్శకం చేయాలని కోరారు. బీబీఎంపీ పాలకవర్గసభ్యుల అధికారం 2019 సెప్టెంబరు 10తో ముగిసిందన్నారు. ఆరువారాలలో బీబీఎంపీ ఎన్నికలు జరిగేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సూచించి హైకోర్టు జారీ చేసిన ఆదేశాన్ని సుప్రీంకోర్టు 2020 డిసెంబరు 18న కొట్టివేసింది. కర్ణాటక మున్సిపల్ కార్పొరేషన్ సవరణ బిల్లు 2020 ప్రకారం 243 వార్డులకు బదులుగా 198 వార్డులకు ఎన్నికలు జరిపేలా హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

వచ్చే ఏడాది ఎన్నికలు: రాష్ట్ర ఎన్నికల కమిషన్

రాష్ట్రప్రభుత్వం తుది గెజిట్‌ను జారీ చేసిన తర్వాత నగర పాలికెల ఓటరు జాబితా సిద్ధంచేసి సందేహాలు, మార్పులు, చేర్పులు ముగించి జాబితా ప్రకటించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు కనీసం 2-3 నెలలు సమయం అవసరం కానుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. ఐదు కార్పొరేషన్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పునఃప్రారంభించేలా ఆదేశిస్తామని కర్ణాటక రాష్ట్ర సూచనలకు అనుగుణంగా అఫిడవిట్‌లు దాఖలు చేయాలని కమిషన్ అదనపు అఫిడవిట్‌కు సంబంధించి వారం రోజుల్లో నిబంధనలు రూపొందించి గెజిట్ విడుదల చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఓటరు జాబితా పూర్తి చేసిన తర్వాత ఐదు నగర పాలికెలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాలని, కమిషన్ తన అఫిడవిట్‌లో పేర్కొంది. వార్డుల విభజనకు అంతిమ గెజిట్ జారీ చేసి వెంటనే ఓటరుజాబితాను సిద్ధం చేసే ప్రక్రియను ప్రారంభించాలని సూచించింది. పాలికెలు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు 40రోజులు అవసరం కానుంది. ఇది ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత ఫలితాల వరకు కోడ్ అమలులో ఉంటుందని వివరించింది. వార్డుల పునర్విభజన, వార్డుల రిజర్వేషన్‌ల కొరకు తుది గెజిట్ జారీ చేసే విషయమై రాష్ట్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొన్న షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని కోర్టు సూచించింది.

● ఎన్నికల నిబంధనలు అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ సమగ్ర వివరాలను ఎప్పటికప్పుడు తెలియపరచడంతోపాటు చట్టపరంగా అనుకూలం కానుందన్నారు. ఈ నిబంధనలు అమలులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రప్రభుత్వానికి విన్నవిస్తామని కమిషన్ తెలిపింది.

జనవరి తర్వాతే..

గ్రేటర్ బెంగళూరు అథారిటీకి అనుబంధంగా ఐదు పాలికెలను విభజించారు. వాటికి సరిహద్దుల విషయంలోనే గందరగోళం ఉంది. దాదాపు ఆగస్టు చివరిదాకా అభ్యంతరాలు, సందేహాలకు అవకాశం ఉంది. ఆ తర్వాత ఓటరు జాబితాను సవరణ చేయాల్సి ఉంది. అనంతరం ఎన్నికల ప్రక్రియ జరపాల్సి ఉంటుంది. వీటన్నింటినీ పరిశీలిస్తే కనీసం మరో నాలుగైదు నెలలు ఎన్నికలు జరపడం అంత సులువేమీ కాదు. పైగా సుప్రీంకోర్టు ఆగస్టులో విచారణ జరిపి ఏకంగా నవంబరుకు వాయిదా వేసింది. ఒకేసారి మూడు నెలలు వాయిదా పడడంతో అప్పటిదాకా ఎటువంటి ప్రక్రియ కొనసాగదు. అప్పుడు ఒకవేళ ప్రక్రియ ప్రారంభించామన్నా కనీసం మూడు, నాలుగు నెలలు సమయం అవసరం అవుతుంది. ఇలా ఈ ఏడాది ఎన్నికలు జరిగే అవకాశమే లేదు. జనవరి లేదా ఫిబ్రవరి తర్వాత ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

జాప్యానికి ప్రభుత్వమే కారణం

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జీఎస్ సంగ్రేసి



స్థానిక సంస్థల ఎన్నికల జాప్యానికి ప్రభుత్వమే కారణమని, న్యాయస్థానం సూచించినా ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయడం లేదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జీఎస్ సంగ్రేసి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 187 స్థానిక సంస్థల గడువు గత ఏడాది నవంబరులోనే ముగిసినట్టు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు సంబంధించి నగరాభివృద్ధిశాఖ రెండుసార్లు హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘనకు పాల్పడిందని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు నగరాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలను జైలుకు పంపాల్సి ఉండేదని హెచ్చరించారు. ఎన్నికలు జరిపేందుకు మేం సిద్ధంగా ఉన్నా రిజర్వేషన్లు ప్రభుత్వమే తేల్చాల్సి ఉందన్నారు. వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేయడం ఎన్నికల కమిషన్‌కు ఉంటే ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు క్రమం తప్పక జరుపుతామన్నారు. ఎన్నికలు జరపకుండానే ఎన్నో ఏళ్లుగా వాయిదాలు వేస్తున్నారన్నారు. ఎన్నికలు జరిపేందుకు రిజర్వేషన్లు తేల్చాలని నగరాభివృద్ధిశాఖకు లేఖలు రాశామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్‌కు పంపాలన్నారు. సవరణ చేస్తారా..? లేదా గత శాసనసభ ఎన్నికల్లో జరిపిన ఓటరు జాబితాకు అనుగుణంగా జరపాలా... అనేది ప్రభుత్వం నిర్ణయించాలన్నారు. ఎన్నికలు జరిపేందుకు రాష్ట్రప్రభుత్వంతో ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగిస్తున్నామన్నారు. ప్రతి లేఖకు ప్రభుత్వ వివరణలు కోరుతున్నామన్నారు. వార్డుల విభజన, రిజర్వేషన్లు ఖరారు చేస్తామని రెండుమూడుసార్లు కోర్టు ముందు వివరించి పాటించలేదన్నారు. పూర్తి బాధ్యత కమిషన్‌కు అప్పగిస్తే అందుకు అనుగుణంగానే వ్యవహరిస్తామన్నారు.



శాప్ ల్యాబ్స్ ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు.. దేశానికే నాలెడ్జ్ సెంటర్

- శాప్ ల్యాబ్స్ ప్రారంభోత్సవంలో సీఎం

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు సిలికాన్ వ్యాలీగానే కాకుండా దేశంలో ఐటీ రాజధానిగా కొనసాగుతోందని ఇక్కడ నాలెడ్జ్ సెంటర్ ద్వారా యువత ఉద్యోగాలే కాకుండా పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని సీఎం సిద్దరామయ్య అన్నారు. దేవనహళ్లిలో ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా ఇన్నోవేషన్ పార్క్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. సీఎం మాట్లాడుతూ ఇది కర్ణాటక సామర్థ్యం, విశ్వసనీయత, గొప్పదనంలో నిబద్ధతకు రుజువుగా ఉందన్నారు. దేశ జీడీపీలో కర్ణాటక 8శాతానికిపైగా సాధిస్తోందని, ఐటీ ఎగుమతులలో 35శాతం, ఎలక్ట్రానిక్స్, పరిశోధనల ఎగుమతిలో 40శాతం మన రాష్ట్రానిదే అన్నారు. 500కుపైగా మల్టీనేషనల్ సామర్థ్య కేంద్రాలు, 18వేల స్టార్టప్‌లు, 40 శాతం యూనికార్న్‌లు కలిగి ఉందన్నారు. శాప్‌ల్యాబ్స్‌తో మరో అడుగు ముందుకేసినట్టు అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి ప్రియాంకఖర్గే, జర్మన్‌దేశ రాయబారి డాక్టర్ ఫిలిప్ ఆర్ ఆకమన్, గహార్డ్ ఓస్వాల్డ్, థామస్ సార్‌సిగ్‌తోపాటు శాప్ ముఖ్యులు పాల్గొన్నారు.

పాత భూరికార్డుల డిజిటలీకరణ

- భూ సురక్షా యోజనకు మంత్రి కృష్ణ బైరేగౌడ శ్రీకారం



డిజిటలీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన మంత్రి

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అనవసరంగా తిరగకుండా ఇంటినుంచే రికార్డులు పొందే సౌకర్యాన్ని తీసుకొస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. భూములకు సంబంధించిన పాత రికార్డుల డిజిటలీకరణ ప్రక్రియను భూ సురక్షా యోజన పేరిట మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. బెంగళూరు నగర జిల్లాలోని రికార్డు రూంలో భూసురక్షా యోజన కింద స్కానింగ్, డిజిటలీకరణను చేపట్టారు. భూములకు సంబంధించి మూల రికార్డులను డిజిటల్ రూపంలో తీసుకురావడం ద్వారా భవిష్యత్తులో రికార్డులు చిరిగిపోయాయని, కనిపించడం లేదనే సమస్య ఉండదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ వివాదాల పరిష్కారం కోసం ఇబ్బంది ఉండదని, దళారులను అరికట్టేందుకు ఇదే మార్గమన్నారు. రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు కలిపి 100కోట్లకుపైగా భూరికార్డులు ఉన్నట్టు అంచనా వేశామన్నారు. ఇందులో 35-36కోట్ల పేజీలను స్కాన్ చేశామన్నారు. ఏసీ, డీసీ కార్యాలయాలలోనే స్కానింగ్ ప్రక్రియ జరుపుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలలో సరాసరిన 10వేల పేజీలను స్కాన్ చేసేందుకు వీలుందన్నారు. భూసురక్షా పథకం ద్వారా భూమాఫియాకు అడ్డుకట్ట వేసినట్టు అవుతుందన్నారు. జిల్లా అధికారి నాగరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

కేరళకు యూరియా అక్రమ తరలింపు

- మండిపడ్డ రైతులు



సీజ్ చేసిన లారీ

బెంగళూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా నంజనగూడు గిడ్డంగి నుంచి కేరళకు యూరియతూను అక్రమంగా తరలించిన అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో యూరియా కోసం నెలరోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. కర్ణాటకకు కేటాయించిన యూరియాను ఇతర రాష్ట్రాలకు తరలించడం నిషేధంగా ఉంది. అయినా కేరళకు అక్రమ మార్గంలో తరలిస్తున్నట్టు రుజువైంది. చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా బండిపుర మూలెహొళె చెక్‌పోస్టులో లారీని వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు పరిశీలించగా అందులో 330 బస్తాల యూరియా ఉంది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. లారీని పోలీసులకు అప్పగించినట్టు వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లు శశిధర్, రమేశ్, కిరణ్ కుమార్ దాడుల్లో పాల్గొన్నారు. కేరళకు రహస్యంగా యూరియాను తరలించడంపై రైతుసంఘాలు మండిపడ్డాయి. కేరళ పట్ల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక అభిమానం చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేరళలో ఏనుగు దాడిలో మరణిస్తే రాష్ట్రంనుంచి పరిహారం ఇచ్చారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువులకోసం రైతులు తల్లడిల్లుతుంటే రహస్యంగా కేరళకు పంపాల్సిన అవసరం ఏం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తుంగభద్ర జలాశయాన్ని సందర్శించిన గవర్నర్



తుంగభద్ర జలాశయం వద్ద గవర్నర్, కుటుంబ సభ్యులు

బళ్లారి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కుటుంబ సభ్యులతో కలిసి విజయనగరం జిల్లా హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయాన్ని మంగళవారం సందర్శించారు. కలెక్టర్ ఎంఎస్ దివాకర్, ఎస్పీ అరుణాంగ్షు గిరి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఏఐతో గుండె సమస్యల గుర్తింపు



మీడియాతో మాట్లాడుతున్న వైద్యబృందం

బొమ్మనహళ్ళి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంలో వైద్యరంగం ముందంజలో ఉంది. ఈసీజీకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానం అమలు చేయడం ద్వారా గుండె సమస్యలను మరింత సులభంగా గుర్తించడం సాధ్యమవుతుందని నారాయణ హెల్త్ ఆసుపత్రి సంస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ దేవిశెట్టి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏఐ పరిశోధనల పరిజ్ఞానంతో 10 సెకన్లలో గుర్తించవచ్చన్నారు. హృద్రోగ సమస్యలను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్సలు సాధ్యమన్నారు. ఇటువంటి ఆవిష్కరణ వైద్యరంగంలో రానున్న రోజుల్లో గొప్ప పరిణామకారి కానుందన్నారు. మీడియా సమావేశంలో వైద్యబృందం పాల్గొన్నారు.

పీఠం వీడిన గురుమల్లేశ్వర మఠం స్వామీజీ

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుండ్లుపేట తాలూకా చౌడహళ్ళి గ్రామం గురుమల్లేశ్వర విరక్తమఠం మఠాధిపతిగా ఉన్న నిజలింగస్వామీజీని గ్రామస్థులు మఠం నుంచి బహిష్కరించారు. యాదగిరి జిల్లా శహపుర తాలూకాకు చెందిన ఇతడి పూర్వనామం మహ్మద్ నిసార్. బాల్యం నుంచే బసవణ్ణ వచనాలు, మానవతా బోధనలతో సాధారణ జీవనాన్ని వదిలి సన్యాం పొందారు. 2020లో బసవదీక్ష పొందారు. ఇలా బసవకల్యాణలో బసవ మహాముని బసవ ప్రభుస్వామీజీ నుంచి లింగదీక్ష పొందారు. 2020 ఆగస్టు 15న మాతాగంగాదేవి నుంచి బసవలింగస్వామీజీగా మారారు. గుండ్లుపేట మఠం శాఖకు ఇతడిని నియమించారు. ఇటీవల స్వామీజీ ఎస్ఎస్ఎల్‌సీ మార్కుల కార్డు బహిరంగమైంది. అతడి మూలం ముస్లిం కావడంతో భక్తులలో వ్యతిరేకత వచ్చింది. భక్తులు రెండు వర్గాలుగా మారారు. కొందరు మద్దతు ఇవ్వగా ఎక్కువమంది వ్యతిరేకించారు. దీంతో సోమవారం పీఠాన్ని వదిలి ఆయన వెనుతిరిగారు.

నేడు సీఎం, డీసీఎం రాక

రాయచూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హట్టి బంగారు గనుల కంపెనీ వద్ద జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం రానున్నట్లు గనుల కంపెనీ చైర్మన్, బీళగి ఎమ్మెల్యే జేటీ పాటిల్ తెలిపారు. మంగళవారం హట్టి బంగారు గని కంపెనీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. 42 ఏళ్ల అనంతరం ముఖ్యమంత్రి హోదాలో సిద్ధరామయ్య హాజరు కావడం విశేషమన్నారు. రూ.985 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సీఎం, డీసీఎంలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు.



డిపోకే పరిమితమైన కేఎస్ ఆర్టీసీ బస్సులు

స్తంభించిన రవాణా

- ప్రత్యామ్నాయం కోసం అధికారుల పాట్లు
- హైకోర్టు హెచ్చరికలతో సమ్మె వాయిదా



బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపు

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెతో మంగళవారం రాష్ట్రమంతటా రవాణా స్తంభించింది. నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 23వేల సర్వీసులు ప్రతిరోజూ సంచరించేవి. లక్షమందికిపైగా ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో బస్సుల సంచారం స్తంభించింది. బెంగళూరులో బీఎంటీసీ బస్సులు మాత్రం కొంతమేర నడిపారు. మిగిలిన మూడు కార్పొరేషన్లకు సంబంధించి తాత్కాలిక ఉద్యోగులు, ప్రైవేట్ బస్సుల ద్వారా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించారు. సమ్మె నిరంతరంగా ఉంటుందని ప్రజలు భావించారు. అయితే హైకోర్టు హెచ్చరికలతో సమ్మెను నిరవధికంగా వాయిదా వేశారు. రాష్ట్రమంతటా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యార్థులు గంటల తరబడి రోడ్లపైనే గడపాల్సి వచ్చింది. మరోవైపు జిల్లాలవారీగా ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకోసం ప్రైవేట్ బస్సులను నడిపారు. కానీ ఆర్టీసీలతో పోలిస్తే 10శాతం కూడా సమకూర్చలేకపోయారు. కలబురగి, హావేరి, విజయపుర, బెళగావి, దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ ప్రాంతాలలో ప్రైవేట్ బస్సులు, వాహనాలతో పర్యాటకులకు ఇబ్బంది కలిగించకుండా చర్యలు చేపట్టారు. బెంగళూరు, మైసూరు నగరాలకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు వారు వెళ్లదలచుకున్న ప్రదేశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. బస్టాండ్‌లో గంటలతరబడి వేచి ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను ప్రశ్నిస్తూ దాఖలైన పిల్‌కు అనుగుణంగా హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఒక్కసారిగా సమ్మె చేస్తే విద్యార్థులు, ఉద్యోగులతోపాటు అత్యవసరంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడతారని పిటిషన్‌లో పేర్కొన్నారు. మంగళవారం ఒకరోజు సమ్మె వాయిదా వేయాలని ధర్మాసనం సూచించింది. అయితే ఉద్యోగసంఘాలు సమ్మెవైపే మొగ్గు చూపాయి. ప్రభుత్వం ఎస్మా జారీ చేసినా ఉద్యోగసంఘాలు పట్టించుకోలేదు. హైకోర్టు ఆదేశాలను పాటించకపోవడంపై ఉద్యోగ సంఘాల తీరును ధర్మాసనం తప్పుబట్టింది. సమ్మెకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని, ఆర్టీసీ ఉద్యోగుల సంయుక్త క్రియాసమితి (జేఏసీ) తరపు న్యాయవాదికి సూచించింది. హైకోర్టు ఉత్తర్వులను పాటించాలని భావించిన సంఘాలు సమ్మెను విరమించుకుంటున్నట్టు ప్రకటించాయి. ఈమేరకు ఉద్యోగుల సంఘం జేఏసీ అధ్యక్షుడు అనంత సుబ్బారావు మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. కోర్టు ఆదేశాలు పాటించాలని రవాణా ఉద్యోగుల సమ్మెను వాయిదా వేస్తున్నామన్నారు. సాయంత్రం నుంచే విధులకు హాజరు కావాలని ఆదేశించారు.



పుష్పాలతో తీర్చిదిద్దిన ఆకృతులు

రేపటి నుంచి లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో

- చురుగ్గా ఏర్పాట్లు

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనం మరోసారి పూలసోయగంతో సర్వాంగ సుందరంగా మారింది. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బ్రిటిష్‌వారిపై పోరాటం చేసిన వీరవనిత కిత్తూరు రాణిచన్నమ్మ, సంగొళ్ళిరాయణ్ణ ప్రతిష్ఠాపనల ద్వారా పూల ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్లాస్‌హౌస్‌లో 218వ ఫ్లవర్‌షో జరగనుందని లాల్‌బాగ్ డైరెక్టర్ రమేశ్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ లాల్‌బాగ్‌తోపాటు రాష్ట్రంలో లభించే పూలతోపాటు కశ్మీర్, రాజస్థాన్, గుజరాత్, వయనాడ్‌లనుంచి కూడా వివిధ రకాల పుష్పాలు దిగుమతి చేసుకున్నట్టు తెలిపారు. గత ప్రదర్శనలకు 7లక్షలమంది సందర్శించారని, ప్రస్తుతం మరింతమంది పెరిగే అవకాశం ఉందన్నారు. 7న గురువారం నుంచి 18వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.



లాల్‌బాగ్ గ్లాస్‌హౌస్‌లో సిద్ధమవుతున్న నమూనా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

ఊ అంటే.. ఉరి..!

ఒకేరోజు నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలో విషాదకర ఘటనలు

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఉరి వేసుకున్నారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు, ఓ నవ వధువు, మరో వ్యక్తి ఉన్నారు. ధర్మవరం, సోమందేపల్లి, కళ్యాణదుర్గం మండల పరిధిలోని కుర్లపల్లి, కణేకల్లు మండల పరిధిలోని నల్లంపల్లిలో ఈ ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త చీర కొనివ్వలేదని..!

ధర్మవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఫ్రెషర్స్ పార్టీకి కొత్త చీర కొనివ్వలేదని తల్లిపై అలిగిన ఇంటర్ విద్యార్థిని ఉషారాణి(17) ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన భాగ్యమ్మ, శ్రీరాములు దంపతుల రెండో కూతురు ఉషారాణి.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భాగ్యమ్మ చేనేత మగ్గం నేస్తుంటారు. శ్రీరాములు ఓ టీ స్టాల్‌లో పని చేస్తుంటారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీరాములు మద్యానికి బానిస కావడంతో కుటుంబ బాధ్యతలు మొత్తం భాగ్యమ్మపైనే పడ్డాయి. ఈ క్రమంలో రూ.5 లక్షలదాకా అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం కనిపించడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిన ఇలాంటి పరిస్థితుల్లో కొత్త చీర కొనివ్వలేనని కూతురుకు భాగ్యమ్మ సర్దిచెప్పారు. అయినా వినకపోవడంతో సోమవారం రాత్రి మందలించారు. దీంతో ఉషారాణి అలిగి, ఏడ్చుకుంటూ రాత్రి నిద్రపోయింది. మంగళవారం ఉదయం ఎవరిపనిమీద వారు బయటకు వెళ్లారు. ఉషారాణి మాత్రం అలిగి అలాగే పడుకుంది. పెద్ద కూతురును రైల్వే స్టేషన్ వద్ద వదిలిపెట్టిన భాగ్యమ్మ.. ఇంటికి తిరిగి వచ్చేలోగా ఉషారాణి ఇంటి పైకప్పునకు చీరతో ఉరి వేసుకుంది. ఇరుగుపొరుగువారి సాయంతో కిందకు దించి, ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక..!



హర్షిత కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఎస్ఐ రమేష్

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నవ వధువు హర్షిత(22) ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని మణికంఠ కాలనీకి చెందిన కృష్ణమూర్తి, వరలక్ష్మి దంపతుల కుమార్తె హర్షిత. కృష్ణమూర్తి కియ అనుబంధ సంస్థలో పనిచేస్తున్నారు. హర్షిత కూడా ఏడాదిన్నరపాటు అక్కడే పనిచేశారు. 2022లో హైదరాబాద్ వెళ్లి, ఇంటీరియర్ డిజైనింగ్ సంస్థలో నాలుగేళ్లు పనిచేశారు. ఒకే కూతురు కావడంతో తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచారు. కూతురు ఉద్యోగం చేస్తూ తనకాళ్లపై తాను నిలబడటంతో పెళ్లి చేయాలని నిర్ణయించారు. కర్ణాటకలోని బాగేపల్లి వద్దనున్న రిబ్బూరిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రతో వివాహాన్ని నిశ్చయించారు. వీరి వివాహం సోమవారం జరగాల్సి ఉండటంతో హర్షిత వారం క్రితమే హైదరాబాదు నుంచి ఇంటికి వచ్చారు. బాగేపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ఉదయం పెళ్లి జరిపించారు. అనంతరం సోమందేపల్లికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన తన స్నేహితులతో హర్షిత సరదాగా గడిపారు. ఆ తరువాత విశ్రాంతి తీసుకుంటానని రాత్రి తన గదిలో ఉరి వేసుకున్నారు. కూతురు ఎంతసేపటికీ బయటకు రాకపోవడం, పిలిచినా పలకకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూశారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు గుర్తించి, వెంటనే కిందకు దించి పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వివాహం ఇష్టంలేక హర్షిత ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్ఐ రమేష్ తెలిపారు. పెళ్లి జరిగిన తరువాత ఈ విషయాన్ని ఆమె తన తండ్రికి చెప్పారని, ముందుగా ఎందుకు చెప్పలేదని తండ్రి ఆవేదన చెందారని అన్నారు. 'మీ పరువుకు భంగం కలిగించడం ఇష్టంలేక ఒప్పుకున్నా' అని హర్షిత తన తండ్రితో చెప్పారని వివరించారు. ఆ తరువాతే గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

బడికి వెళ్లమన్నందుకు..!

కణేకల్లు(ఆంధ్రజ్యోతి): బడికి సక్రమంగా వెళ్లనందుకు తల్లి మందలించడంతో అరవింద్(15) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపిన మేరకు, కణేకల్లు మండలం నల్లంపల్లి గ్రామానికి చెందిన బసప్ప, రేణుకమ్మ దంపతుల కుమారుడు అరవింద్ పూలచెర్ల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేయడంతో తల్లి రేణుకమ్మ మందలించారు. అయినా మంగళవారం కూడా బడికి వెళ్లకుండా తల్లితోపాటు పొలంలో టమోటాలు కోసేందుకు వెళ్లాడు. దీంతో 'పదో తరగతి చదువుతున్నావు. ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎలా..?' అని తల్లి మరోసారి మందలించడంతో అరవింద్ మనస్తాపానికి గురయ్యాడు. నేరుగా ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి, కిందకు దించారు. కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అరవింద్ తండ్రి గతంలోనే చనిపోయారు. ముగ్గురు కూతుళ్ల తరువాత పుట్టిన ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో రేణుకమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

తాగేందుకు డబ్బు ఇవ్వలేదని..!

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాగేందుకు భార్య డబ్బు ఇవ్వలేదని నాగేంద్ర ప్రసాద్(43) అనే వ్యక్తి ఉరివేసుకున్నాడు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని కుర్లపల్లిలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. నాగేంద్ర ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి డబ్బుల కోసం భార్యతో గొడవ పడ్డాడు. డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మద్యం మత్తులో, కోట రామయ్య ఇంటి పక్కన కిటికీకి తాడుతో ఉరి వేసుకున్నాడు. నాగేంద్రకు భార్య వరలక్ష్మి, కుమారుడు ఘన శ్యాంప్రసాద్, కూతురు గౌతమి ఉన్నారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్లు తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆదానితో చేసుకున్న ఒప్పందంలో భాగంగా రూ.1.10వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఒప్పందం రద్దుచేసి స్మార్ట్‌మీటర్లు బిగించనీయమని చంద్రబాబు మాట ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం కొలువుతీరిన తరువాత స్మార్ట్‌మీటర్లకు అనుమతినిచ్చిందన్నారు. వెంటనే స్మార్ట్‌మీటర్లను అనుమతించవద్దని కోరారు. అనంతరం ఏఈ పరమేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలస్వామి, రాజగోపాల్, బాబాజాన్, చంద్రశేఖర్, శ్రీకాంత్, ఆంజనేయులు, అంజినమ్మ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాత ఫోన్‌లో కొత్త యాప్‌లు..!

సక్రమంగా పనిచేయని ఫోన్లు

నెట్‌వర్క్ అందక ఇక్కట్లు

గంటల తరబడి యాప్‌లతో అంగన్‌వాడీల కుస్తీ

పని చేయట్లేదంటూ వాపసు

కొత్తవి ఇవ్వాలని డిమాండ్



సెల్‌ఫోన్లు వాపసు చేసేందుకు చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చిన అంగన్‌వాడీలు (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాత ఫోన్లలో కొత్త యాప్‌లతో అంగన్‌వాడీలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు యాప్‌లతో పనిలేకుండా చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. గతంలో ఉన్న యాప్‌లకు తోడు బాల సంజీవని 2.0 వర్షన్‌తో పనిభారం మోపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రేషన్ సరుకులను మరింత పకడ్బందీగా పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం యాప్‌లో మార్పులు, చేర్పులు చేసింది. అప్పటినుంచి అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ కాక అవస్థలు పడుతున్నారు. యాప్‌ల నిర్వహణలో సమస్యలను పరిష్కరించకుండా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని ఒత్తిడి చేస్తుండటంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తాజాగా బాలసంజీవని 2.0 వర్షన్‌తో కొత్తయాప్‌లు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిలో కార్యకర్తలు, హెల్పర్లు, ఫొటో క్యాప్చర్ చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో పౌష్టికాహార పంపిణీలో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పనిని మూడు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి వస్తుండడం, యాప్‌లో సాంకేతిక లోపం కారణంగా పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనానికి ఫేస్‌యాప్‌తో ముడిపెట్టారు. ఫేస్‌యాప్ వేసిన రోజులకు మాత్రమే వేతనం వస్తుంది. సాంకేతిక సమస్య తలెత్తి ఆ రోజు యాప్‌లో నమోదు కాకపోతే కట్ అవుతుంది. ప్రభుత్వం కోరిన సమాచారాన్ని యాప్‌ల ద్వారా ఇవ్వడం, రికార్డులు రాయడం, టేక్‌హోం రేషన్ పంపిణీ, ప్రతినెలా 1 నుంచి 5వతేదీ వరకు పిల్లల బరువు పరిశీలించడంవంటి పనులు చేయాల్సి ఉంటుంది. రూ.11,500 గౌరవ వేతనం ఇస్తూ నెలంతా తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడుతున్నారు. కనీస వేతనం అమలు చేయాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్లు వాపసు

సీడీపీఓ కార్యాలయాల్లో పాత ఫోన్లను అంగన్‌వాడీలు తిరిగి ఇచ్చేశారు. ఫోన్లు సరిగా పని చేయని, నెట్‌వర్క్ సరిగా లేని సిమ్‌లు ఇచ్చారని వారు వాపోయారు. మంచి ఫోన్లు ఇవ్వాలనీ, అప్పటి వరకు ఆన్‌లైన్ వర్క్ చేయమని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. ఆ మేరకు ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

వారంలో కొత్త ఫోన్లు అందజేస్తాం

ఫోన్లు సక్రమంగా పనిచేయట్లేదని అంగన్‌వాడీలు వాపసు చేస్తున్న విషయం వాస్తవమే. విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాం. కొత్తఫోన్ల కొనుగోలు కోసం ప్రభుత్వం.. ఆర్థిక శాఖ ఆమోదానికి పంపింది. త్వరలో అప్రూవల్ అవుతుందని మెసెజ్‌లు కూడా వచ్చాయి. వచ్చే వారంలో కొత్త ఫోన్లను ప్రభుత్వం అందజేస్తుంది.

-ప్రమీల, పీడీ, ఐసీడీఎస్

ఆరితేరిన దొంగల పనేనా?

పోలీసులకు సవాల్‌గా బ్యాంకు చోరీ కేసు

ఆధారాల కోసం ముమ్మర దర్యాప్తు

నాలుగు రాష్ట్రాలకు.. ఎనిమిది బృందాలు



లాకర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ

హిందూపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూమకుంట చెక్‌పోస్టులో గతనెల 26న అర్ధరాత్రి బ్యాంకులో భారీ చోరీ కేసులో నేటికీ ఎలాంటి ఆధారమూ దొరకలేదు. దీనిని బట్టి చూస్తే పక్కా ప్రొఫెషనల్స్ చోరీ చేసినట్లు తెలుస్తోంది. 592 మంది ఖాతాదారులు తాకట్టు పెట్టిన సుమారు రూ.10కోట్ల విలువచేసే బంగారం చోరీ చేసుకెళ్లారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చాక పోలీసులు రంగప్రవేశం చేసి వివరాలు సేకరించారు. ఘటనాస్థలంలో ఆధారాలు లభించకుండా దొంగలు జాగ్రత్త పడ్డారు. చోరీకి పాల్పడినది ఉత్తరాది ముఠా అయి ఉంటుందన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

సవాల్‌గా మారిన కేసు

ఇంత పెద్దమొత్తంలో బంగారాన్ని చోరీ చేసుకెళ్లడం జిల్లాలో ఇదే ప్రథమమని చెప్పవచ్చు. దీంతో కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. చోరీ వెలుగులోకి వచ్చిన 28వ తేదీ నుంచి పోలీసు అధికారులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. కేసును త్వరగా ఛేదించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తోంది. దీంతో డీఐజీ, ఎస్పీ రోజూ పర్యవేక్షిస్తున్నారు. డీఎస్పీ మహేష్ బ్యాంకుతోపాటు పరిసరాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. తూమకుంట చెక్‌పోస్టు నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు 40కి.మీ. దూరంగా రోడ్డుపక్కనున్న సీసీ టీవీ ఫుటేజీని చూస్తున్నారు. హిందూపురం, లేపాక్షి, మడకశిర, పెనుకొండ, తుమకూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కూడా దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి ముందు అలాంటి వ్యక్తులు బ్యాంకులోకి వచ్చి, వెళ్లారా అనే కోణంలో ఆరాతీస్తున్నారు. రెక్కీ నిర్వహించిన తరువాతే ఇంతపెద్ద చోరీ చేస్తారని పోలీసులు అనుమానిస్తున్నారు. దుండగులు ఎటువైపు నుంచి వచ్చారో తెలుసుకునే పనిలో పోలీసులు ఉన్నారు. వారు ఎలాంటి వాహనాలు ఉపయోగించారు అన్నది సీసీ టీవీ ఫుటేజీలో దొరక్కపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. నెలరోజుల సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ తరహాలో చోరీ చేసిన ప్రాంతాలను గుర్తించి అక్కడి పోలీసులను ఆరాతీస్తున్నారు.

నాలుగు రాష్ట్రాలకు బృందాలు..

బ్యాంకు చోరీ కేసును ఛేదించేందుకు గతనెల 28న ఆరు బృందాలను మూడు రాష్ట్రాలకు పంపారు. మరో రెండు బృందాలు ఇంకో రాష్ట్రానికి వెళ్లాయి. మరికొంతమంది పోలీసులు ఇక్కడే ఉండి వారికి ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. ఇందులో కర్ణాటక, తమిళనాడు ఢిల్లీ, ఒడిశా, అస్సాం రాష్ట్రాల్లో ఆరాతీస్తున్నట్లు సమాచారం. చోరీకి వచ్చిన నిందితుడు అలార్మ్ వైర్లు కత్తిరించే సమయంలో సీసీ కెమెరాలో రికార్డయిన ఫొటోలను ఇతర రాష్ట్రాల పోలీసులకు పంపించారు. ఈ తరహా వ్యక్తి ఏ రాష్ట్రంవారో కనుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. మొదట ఏ రాష్ట్రానికి చెందినవాడో గుర్తిస్తే అతడిని పట్టుకోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి కేసుపై ఒత్తిడి పెరగడంతో రోజు రోజుకు పోలీసుల్లో టెన్షన్ పుంజుకుంటుంది. దీనిపై డీఎస్పీ మహేష్‌ను మంగళవారం అడగ్గా.. ఇప్పటి వరకు ఎలాంటి ఆధారం దొరకలేదన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లిన బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు.

పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తా

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బంజారా మహిళలతో కలిసి పుట్టినరోజు వేడుకలు

ప్రతి ఇంటికి నెలకు సరిపడా

నిత్యావసర సరుకుల పంపిణీ

పండుగలా సాగిన వేడుకలు



ఎమ్మెల్యే అమిలినేనికి కేక్ తినిపిస్తున్న బంజారా మహిళలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తానంటూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను పట్టణంతోపాటు, మారుమూల గ్రామాల్లో సైతం పండుగలా నిర్వహించారు. మండలంలోని నుసికొట్టాల తండాలో బంజారా మహిళల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, వేడుకలు జరుపుకున్నారు. ఇదే గ్రామంలో ప్రతి ఇంటికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, మిక్సీని అందజేశారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను సొంత డబ్బుతో ఏర్పాటుచేసి, ప్రారంభించారు. గ్రామానికి ఐదు కిలోమీటర్ల తారురోడ్డు, రూ.20 లక్షలతో విద్యుత్ స్తంభాలను మార్చి ఇబ్బందులు లేకుండా చేశారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో 101 టెంకాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. నాయీబ్రాహ్మణులు, ముస్లింలు, స్వర్ణకారుల సంఘం, వాల్మీకి సోదరులు, ప్రజావేదిక వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటుచేసిన బర్త్‌డే కేక్‌లను ఎమ్మెల్యే కట్ చేసి, స్వీట్లను పంచిపెట్టారు. ఆయాశాఖల ఉన్నతాకారులు, సిబ్బంది.. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చి, వెనకబడ్డ ప్రాంతం అనే పదాన్ని చెరిపేస్తానన్నారు. బీటీపీ కాలువ పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

15 వరకు హర్ ఘర్ తిరంగా

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగ ప్రచారాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖలతో సమన్వయం కోసం జిల్లా పర్యాటక అధికారి ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ సూచనలు పాటిస్తూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈనెల ఆరో తేదీ దేశభక్తి గీతాల ఆలపన , దేశభక్తి నాటకం/మోనో యాక్షన్ ప్రదర్శనలు, పాఠశాలలు, కళాశాలల్లో తిరంగ గీతం వినిపించడం, తిరంగ ప్రేరేపిత కళతో పాఠశాలల గోడలు, బోర్డులను అలంకరించడం, పాఠశాలలు, అన్ని బహిరంగ ప్రదేశాలలో తిరంగ ప్రదర్శన, తిరంగ చరిత్రపై క్విజ్ విద్య కార్యక్రమాలు నిర్వహించడం, తిరంగ రాఖీ తయారీ పోటీలు, వర్క్‌షాప్‌లు త్రివర్ణ థ్రెడ్‌తో కూడిన ఏదైనా కార్యాచరణ చేపట్టాలన్నారు. డీపీఓ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈనెల 7న డీఆర్డీఏ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈనెల 8న అనంతపురంలో రన్/మారథాన్‌తో తిరంగ కచేరీ నిర్వహణ తదితరాలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 15న జరిగే వేడుకలకు జాతీయ జెండా ఎగురవేయాలని, వీటీసీ డీఎస్డీఓ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. ఈనెల 11న టాప్ 10 వలంటీర్లను ఆహ్వానించాలన్నారు. అన్ని ప్రభుత్వ భవనాలు, స్మారక చిహ్నాలు, వంతెనలు, మార్కెట్లు, హోటళ్లు, ఆనకట్టలు, వీధులకు మూడు రంగుల లైటింగ్, అలంకరణలు చేయాలన్నారు. ఈనెల 12న 2023లో నిర్మించిన శిలాఫలకాల వద్ద స్థానిక నాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ వేతనదారులతో జాతీయ జెండా ఎగురవేయడం ప్రారంభించాలన్నారు. డ్వామా పీడీని మానిటర్ చేయాలన్నారు. ఈనెల 13న తిరంగ నివాళి...స్థానిక కార్యక్రమాలు, తిరంగ ర్యాలీలు ధైర్యవంతులైన హృదయాలను/స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబాలను గౌరవించాలన్నారు. 14న మండల, గ్రామ/వార్డు కార్యదర్శులతో తిరంగ యాత్రను డీపీఓ నిర్వహించాలన్నారు. ఈనెల 15న జిల్లాలోని అన్ని విభాగాలు జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. జిల్లాలో హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

గుంతకల్లు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06519) ప్రత్యేక రైలు ఈ నెల 14న బెంగళూరులో రాత్రి 9-15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం పదకొండున్నరకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06520) ఈ నెల 15న బీదర్‌లో మధ్యాహ్నం రెండున్నరకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం నాలుగున్నరకు బెంగళూరుకు చేరుతుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాహాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా బీదర్‌కు వెళ్తుందన్నారు. అలాగే కోయంబత్తూరు-జైపూర్ ప్రత్యేక వీక్లీ రైలు ఈనెల 7 నుంచి సెప్టెంబరు 4 వరకూ గురువారాలలో కోయంబత్తూరులో ఉదయం రెండున్నరకు బయల్దేరి రెండో రోజు (శని వారాలలో) మధ్యాహ్నం 1-25 గంటలకు జైపూర్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06182) ఈనెల 10 నుంచి సెప్టెంబరు ఏడు వరకూ ఆదివారాలలో రాత్రి 10-05 గంటలకు జైపూర్‌లో బయల్దేరి మూడో రోజు (బుధవారాలలో) ఉదయం ఎనిమిదిన్నరకు కోయంబత్తూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టి, కాట్పాడి, రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, కామారెడ్డి, నిజామాబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, హింగోలి, వాసిం, అకోలా, భూసావల్, జల్‌గావ్, నందుర్‌బర్, ఉద్నా, భరుచ్, బడోదర, గోద్రా, రత్లం, జవోరా, మండ్‌సర్, నిమచ్, చిత్తౌర్‌ఘర్, చండేరియా, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిరాబాద్, అజ్మీర్, కిషన్‌ఘర్ స్టేషన్ల మీదుగా జైపూర్‌కు చేరుకుంటుందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని దాదాపు 30 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ కాటమయ్య తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రాత్రి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పట్టీలు గల టీషర్టు, జీన్స్‌ప్యాంట్ ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మోసంపై ఫిర్యాదు

తాడిపత్రి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాయమాటలతో తమ నుంచి రూ.8 లక్షలు కాజేశారని పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఇద్దరు మహిళలు ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. కొంతకాలంగా కొందరు వ్యక్తులు మీ ఇంటిలో సరిగా లేదు, ఆర్థికంగాను, ఆరోగ్యంగా ఇబ్బంది పడుతున్నారని బాధితులకు ఫోన్‌లో చెప్పారు. మీరు డబ్బులు ఇస్తే తమ ఇంటిలో ఉన్న సమస్యలు తొలగించి, అంతా బాగు చేస్తామని నమ్మబలికారు. ఈక్రమంలో రెండునెలల కిందట రూ.4లక్షలు, ఈ మధ్యకాలంలో మరో రూ.4లక్షలు ఫోన్‌పే ద్వారా వేయించుకొన్నారని తెలిపారు. ఆ తర్వాత ఫోన్ పనిచేయడం లేదని బాధితులు వాపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్ణప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 8లోగా పూర్తి చేసిన దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. పదేళ్ల సర్వీసు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రైవేటు తప్పా అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

18న జిల్లాస్థాయి యోగా టోర్నమెంట్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యోగా టోర్నమెంట్‌ను పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ఈనెల 18న నిర్వహించనున్నట్లు యోగా సంఘం జిల్లా కార్యదర్శి మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను 8నుంచి 45 సంవత్సరాల పైబడిన బాల, బాలికలు, మహిళ, పురుషుల విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారు ఆగస్టు చివరి వారంలో వెస్ట్ గోదావరి జిల్లా వేదికగా జరిగే 50వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాల, బాలికల పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్:9398014919, 9590633388 నెంబర్లను సంప్రదించాలన్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురంరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటా కాయలు వచ్చాయని పేర్కొన్నారు. కిలో కనిష్ఠ ధర రూ.30, సరాసరి ధర రూ.40తో విక్రయాలు జరిగాయన్నారు.

పంచాయతీ అధికారుల దాడులు

ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు

గోరంట్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తున్న వ్యాపార సముదాయాలపై మేజర్ పంచాయతీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పంచాయతీ ఈఓ సుబ్రహ్మణ్యం, గుమస్తా సాయిసంజయ్, సిబ్బంది దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. మద్యం దుకాణాలు, బెల్టుషాపుల వద్ద దుకాణాల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ గ్లాసుల బ్యాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇతర దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని చివరిగా హెచ్చరించారు. ఎస్సీకాలనీలో ముజబేర్ రహమాన్ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సోదా చేసి వాటిని స్వాధీనం చేసుకుని రూ.రెండువేల జరిమానా విధించారు. అంతేకాకుండా వాటిని సరఫరా చేస్తున్న హిందూపురం హోల్‌సెల్ వ్యాపారిని ఫోన్‌ద్వారా అధికారులు మందలించారు. దాదాపు రూ.30వేల విలువల చేసే ప్లాస్టిక్‌గ్లాస్లులు, కవర్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

బురదలో చిక్కుకున్న స్కూల్ వ్యాన్

ఇబ్బందిపడ్డ విద్యార్థులు



స్కూల్ వ్యాన్‌ను తోస్తున్న విద్యార్థులు

రొద్దం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుట్టూరు సమీపంలో ప్రైవేట్ స్కూల్‌వ్యాన్ బురదలో ఇరుక్కుని విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. మంగళవారం ఉదయం 8.30గంటలకు కొత్తూరువద్ద స్కూల్‌వ్యాన్ బురదలో చిక్కుకుంది. దీంతో విద్యార్థులు బురదలో దిగి వ్యాన్ తోయడానికి నానా ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో బురదగుంటగా ఏర్పడిందని గ్రామస్థులు అంటున్నారు. స్కూల్ వ్యాన్ తోయడానికి గ్రామస్థులు సాయపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కొత్తపల్లి జయశంకర్ (జయంతి)



తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934 ఆగస్టు 6న హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ శివారులోని అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషల్లో పట్టు కల్గినవారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ వరకు ఉన్నత హోదాలలో కొనసాగారు. నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్-ఇడ్లీ గో బ్యాక్ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కే చంద్రశేఖరరావుకు సలహాదారుడిగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే 2011 జూన్ 21న కన్నుమూశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ)గా ఆయన గౌరవార్థం పేరు పెట్టడం విశేషం.

సుష్మాస్వరాజ్ (వర్ధంతి)



భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో ప్రముఖ మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందిన సుష్మాస్వరాజ్ 1952 ఫిబ్రవరి 14న హర్యానా రాష్ట్రం అంబాలా ప్రాంతంలో జన్మించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగారు. విద్యార్థి సంఘం నాయకురాలిగా చురుగ్గా ఉంటూ రాజకీయాల్లో రాణించారు. ప్రధాని వాజ్‌పేయి మంత్రివర్గంలోనూ, నరేంద్రమోదీ కేబినెట్‌లోనూ కొనసాగారు. 2019 ఆగస్టు 6న కన్నుమూశారు. 2020లో మరణానంతర 'పద్మ విభూషణ్' పురస్కారం ప్రకటించారు.

రేపు మహిళా ఉద్యోగమేళా

ముళబాగిలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వేదాంత ఫౌండేషన్, జిల్లా రోటరీ సంస్థ, రోటరీ ముళబాగిలు సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ఆవరణలో మహిళలకోసం ఈనెల 7న ఉద్యోగమేళా జరగనుంది. గురువారం ఉదయం 9.30 గంటలనుంచి సాయంత్రం 4.30వరకు మేళా ఉంటుందని రోటరీ జిల్లా మహిళా నైపుణ్యాభివృద్ధి విభాగం ముఖ్యులు సరితా బాలాజి తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువమంది మహిళలు నిరుద్యోగులు ఉండడంపై తీవ్రంగా పరిగణించి మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, కొత్తగా డిగ్రీ పూర్తి చేసినవారు 18-30ఏళ్లలోపు అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు. మేళాకు మరిన్ని వివరాలకు 9739316404కు సంప్రదించాలని తెలిపారు.

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్న కారు

● ముగ్గురి మృతి



ధ్వంసమైన కారు

తవణంపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని ఎలాక్ట్రానిక్ సిటీకి చెందిన శ్రీకాంత్(34) తన తల్లి లక్ష్మీదేవి(55), కుమారుడు శ్రీయాన్(3)తో కలిసి తిరుమలేశుడిని దర్శించుకుని కారులో మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రానికి తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిపై చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపాన ఉన్న నయారా పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులోని శ్రీకాంత్, లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడ్డ శ్రీయాన్ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



పవన్ (ఫైల్)

బళ్లారిరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మినీ ఆటోను లారీ ఢీకొన్నప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు తాలూకాలోని మీనళ్లి గ్రామానికి చెందిన పవన్ ఆటోలో గోడేహాళ్ క్రాస్‌వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ వేగంగా ఢీకొంది. ఈప్రమాదంలో పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ఉన్న మరో ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఆర్టీసీ సమ్మె ప్రభావం నామమాత్రం

చింతామణి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె ప్రభావం పెద్దగా చూపలేదు. అధికశాతం సిబ్బంది సమ్మెలో ఉన్నా చాలావరకు బస్సుల రాకపోకలు కొనసాగాయి. పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు బందోబస్తు చేపట్టారు. పలు డిమాండ్ల సాధనకై ముఖ్యమంత్రి సిద్దరామయ్య జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికసంఘాల పిలుపుతో మంగళవారం సమ్మె చేపట్టారు. హైకోర్టు ఒక రోజుపాటు సమ్మెను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఉదయంనుంచే కేఎస్ఆర్టీసీ డిపోలో సిబ్బంది హాజరు తక్కువగా ఉన్నప్పటికీ కొంతమేర బస్సులు నడిపారు. సాధారణ రోజులతో పోలిస్తే ప్రయాణీకుల సంఖ్య తక్కువగానే ఉంది.

ముళబాగిలులో..

ముళబాగిలు: వివిధ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రవాణా సంస్థ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కారణంగా తాలూకాలో బస్సుల సంచారం పూర్తిగా నిలిచిపోయింది. మంగళవారం ఉదయం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం వెలవెలబోయింది. పలువురు పట్టణంనుంచి గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయించారు. తాలూకాలో 93 మార్గాలలో 101 బస్సులు సంచరించేవి. సమ్మె కారణంగా 94 బస్సులు ముళబాగిలు డిపోలోనూ, మరో 7 బస్సులు వేర్వేరుచోట్ల ఆపేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుబందోబస్తు చేపట్టారు. కాగా బస్సుల సమ్మెకారణంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు సగానికి పడిపోయింది.



చింతామణి బస్టాండ్‌లో నామమాత్రంగా ప్రయాణికులు



వెలవెలబోతున్న ముళబాగిలు బస్టాండ్



బందోబస్తులో పోలీసులు

బెంగళూరులో కదలని బస్సులు



బోసిపోయిన మెజెస్టిక్ బస్టాండ్





డిపోకే పరిమితమైన బస్సులు



పెద్దసంఖ్యలో ప్రైవేట్ బస్సులు

రోడ్లపై వర్షపునీరు... వాహన చోదకులకు ఇక్కట్లు

బాగేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన బాగేపల్లిలో మంగళవారం సాయంత్రం కొంతసేపు వర్షం కురిసింది. ఒక మోస్తరు వర్షానికే రోడ్డుపై నీరు నిలిచింది. డాక్టర్ హెచ్ఎన్ సర్కిల్‌లో వర్షపునీరు సజావుగా కాలువలోకి ప్రవహించలేదు. కాగా మురుగుకాలువ నీరు కూడా రోడ్డుపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. పురసభ పాలనవైఫల్యాన్ని తప్పుబట్టారు. ఇటీవల కాలువలలో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించినా పరిస్థితిలో ఏమాత్రం రాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీవీజీ రోడ్డు, వాల్మీకి నగర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్, కుంబారపేట, ఆవులమందె రోడ్డు, సంతె మైదానం, కొత్తపల్లి, గూళూరు రోడ్డు తదితర వార్డులు జలావృత మయ్యాయి. పలువురు వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దొమ్మసంద్రలో..

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకాలో మంగళవారం కురిసిన వర్షానికి సర్జాపుర మెయిన్‌రోడ్డు కొడతిగేట్ సమీపాన రోడ్డుపై మోకాలిలోతు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్ర రహదారిపైనే ఈ పరిస్థితి నెలకొనడంతో వాహనచోదకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీపంలోనే సూలికుంటె చెరువుకు సంబంధించిన రాజకాలువ ఆక్రమణకు గురికావడంతోనే తరచూ ఈ సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆరోపించారు. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షపు నీటి సమస్యపై ప్రజాప్రతినిధులు స్పందించాలని, రోడ్లను బాగు చేయాలని పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు.



బాగేపల్లి పట్టణంలో జలమయమైన రోడ్డు



దొమ్మసంద్రలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

దుష్ప్రచారం సరికాదు: ఎమ్మెల్యే



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్ణాటక రైస్‌మిల్లు స్థలంలో స్థలాల విభజనకు సంబంధించి కొన్నిసంఘాలు దుష్ప్ర చారం చేస్తున్నాయని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారా యణస్వామి వెల్లడించారు. పట్టణంలో మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఖరాబు స్థలాన్ని ఆక్రమించి స్థలాలను విభజిస్తున్నారనడం సరికాదన్నారు. ఇది ఖరాబు స్థలం కాదని, ఆక్రమణ అంతకన్నా కాదన్నారు. 1958 నుంచి సుమారు ఏడు దశాబ్దాలుగా కర్ణాటక రైస్‌మిల్లు స్థలం పురసభ పరిధిలో ఉందన్నారు. ఈ స్థలాలు ఎలాంటి సర్వే నెంబరులో లేదన్నారు. తర్వాత ఆర్‌హెచ్ రామకృష్ణశెట్టి, విశ్వనాథశెట్టిల సొత్తుగా ఉందన్నారు. అనంతరం ఈ స్థలం వాణిజ్య అవసరాలకు మార్పు జరిగిందన్నారు. 15ఏళ్ల క్రితం మిల్లు లావాదేవీలు లేకపోవడం వాణిజ్యానికి మార్పు చేశారన్నారు. సదరు స్థలాన్ని ఇంటి స్థలాలకు మార్పు చేయడానికి ప్రభుత్వానికి స్థలం యజమాని లేఖ రాశారన్నారు.

వాణిజ్య స్థలాన్ని ఇంటిస్థలంగా మార్పు చేసేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. సాధారణంగా ల్యాండ్ కన్వర్షన్ చేసి లే అవుట్ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అవసరం ఉందని, అయితే ఇందుకు అవసరం లేదన్నారు. మొత్తం 4 ఎకరాల 21 గుంటల స్థలం ఉండగా ప్రస్తుతం 3.21 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. వాస్తవ ప్రదేశానికంటే ఒక ఎకరా తక్కువగా ఉందన్నారు. ఇందులో ఖరాబు స్థలం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. రమేశ్‌నాయుడు, శేఖర్‌లు కొనుగోలు చేసిన ఖాతాను విభజించేందుకు పురసభకు లేఖ రాశారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మీడియా సమావేశంలో పురసభ అధ్యక్షుడు గోవింద, సభ్యుడు షఫి, ముఖ్యాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోండి

» రాష్ట్రరైతు సంఘాల సమాఖ్య డిమాండ్

శిడ్లఘట్ట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర జిల్లాలో ఉల్లి పంటకు సరైన ధర లేక ఉల్లిరైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్రప్రభుత్వం స్పందించి కనీసధరతో ఉల్లిని కొనుగోలు చేయాలని రాష్ట్రరైతుసంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. సమాఖ్య సంచాలకులు సీవీ లోకేశ్‌గౌడ పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ శిడ్లఘట్ట నియోజకవర్గంలోని బశెట్టిహళ్ళి హోబళితోపాటు జిల్లా వ్యాప్తంగా ఉల్లిరైతులు సమస్యలు ఎదుర్కొంటున్నా రన్నారు. ఉద్యానశాఖ అధికారులు స్వయంగా తోటలలో పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వదృష్టికి తేవాలన్నారు. తద్వారా అన్నదాతలకు న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీ ర్వాదంతో బీజేపీలో అనేక హోదాలలో కొనసాగి రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందానన్నారు. ప్రజల రుణం తీర్చుకునేలా ప్రజాసేవా కార్య క్రమాల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. మీడియా సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీవీ లోకేశ్‌గౌడ తదితరులు

భీమ జ్యువెలర్స్‌లో వరమహాలక్ష్మికి ఆఫర్

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో పండుగల సీజన్ వచ్చేసింది. భీమ జ్యువెలర్స్ వినియోగదారులకోసం ప్రత్యేకమైన ఆఫర్‌ను ప్రకటించింది. భీమ శుభ వరమహాలక్ష్మిని ప్రారంభించినట్టు ప్రకటించారు. బంగారం, వెండి ధరలపై 10శాతం తగ్గింపు ఇస్తోందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఇదో అద్భుతమైన సమయమని, వజ్రాభరణాలపై కేరట్‌కు ఫ్లాట్‌గా రూ.7వేల తగ్గింపు ఇస్తున్నామన్నారు. బంగారం ధరలపైనా 10శాతం తగ్గింపును అందిస్తున్నట్టు ప్రకటించారు. ప్రత్యేక ఆఫర్‌ల ద్వారా సంపదను ఇంటికి తీసుకొచ్చేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారికి బంగారం, వెండిధరలపై 10శాతం తగ్గింపుతోపాటు మేకింగ్ చార్జీలపై 20శాతం తగ్గింపు పొందవచ్చునన్నారు. బంగారం, వజ్రాలపైనా ఫ్లాట్‌గా 10శాతం, వజ్రాల విలువపై అదనంగా 20శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. ప్రతి 50వేల కొనుగోలుపై వినియోగదారులకు వెయ్యి రూపాయలు తగ్గింపు ఉంటుందన్నారు. శతాబ్దాలుగా వస్తున్న వారసత్వంతో భీమ జ్యువెల్స్ హస్తకళలు, వినూత్నమైన డిజైన్‌లకు పేరొందిందన్నారు. ప్రతి ఆభరణం, బ్రాండ్, గుణాత్మకత, నిబద్ధతకు నిదర్శనంగా ఉంటుందన్నారు. పండుగ సీజన్‌లో ఆభరణాలతోపాటు అద్భుతమైన ఆఫర్‌లను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఇంటి భీమ శుభ వరమహాలక్ష్మిని జరుపుకొనేలా ఆఫర్‌లు ఇస్తోందన్నారు.

మహిళలు సాధకులని కువెంపు గుర్తించారు



వేదికపై డాక్టర్ రుద్రేశ్ అదరంగి తదితరులు

బెంగళూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యంలో మహిళలు మహా సాధకులని కువెంపు గుర్తించారని కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి అభిప్రాయపడ్డారు. ఎంఈఎస్ కళాశాల మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రసంగంలో కువెంపు రచనలను ప్రస్తావించారు. కువెంపు సమగ్ర సాహిత్యంలో మహిళకు సంబంధించిన అంశాలు ప్రధానంగా ప్రస్తావించారన్నారు. రామాయణ దర్శనం మహాకావ్యంలో వేశ్య అయినా ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడం నేరమని పేర్కొన్నారన్నారు. మంతరె, అనలె, అహల్య, చంద్రనఖి లాంటిపాత్రలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎంఈఎస్ విద్యాసంస్థ స్నాతకోత్తర కేంద్రం డైరెక్టర్ రామకృష్ణయ్య, కన్నడ అధ్యాపకులు డాక్టర్ భాగ్య, డాక్టర్ సురేశ్ నాగలమడికె తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాట్య ప్రదర్శన

బెంగళూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ సాంస్కృతిక సంబంధ పరిషత్‌తోపాటు పలు విభాగాల సంయుక్త సహకారంతో నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారతీయ విద్యాభవన్‌లో జరిగిన జీవీ సురభి భారతనాట్య ప్రదర్శన ప్రత్యేకంగా ఉంది. 43వ ఏట ఆగస్టు నెలలో సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సురభి నృత్య ప్రదర్శన జరిగింది. గురువు శాలిని శ్రీకాంత్ పర్యవేక్షణలో నృత్య ప్రదర్శనలు సాగాయి.



నృత్యం చేస్తున్న సురభి

విద్యార్థులు విలువలు పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బెంగళూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు విలువలు పాటించాలని విద్యాలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకురాలు మంగళ సిద్ధలింగయ్య తెలిపారు. పాఠశాలలో వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాలకు ఇటీవల పలు రికార్డులు సాధించేందుకు ఇక్కడి విద్యార్థుల సాధనే కారణమని ఆమె అభిప్రాయపడ్డారు. కఠినశ్రమతోపాటు మానవత్వం, గురువులు, తల్లిదండ్రులు పెద్దలపట్ల భక్తి భావం ఉండాలని సూచించారు. పాఠశాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆశయం సత్ఫలితాలు ఇస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ యంత్రాలను అద్దెప్రాతిపదికన అందించేందుకు జిల్లాలోని యంత్ర కేంద్రాలను మరింత బలోపేతం చేయడానికి హైటెక్ హార్వెస్టర్ హబ్‌పథకం కింద కంబైన్డ్ హార్వెస్టర్ హబ్ ఏర్పాటుకు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించినట్లు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ డీటీ మంజునాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్‌యూనిట్ కింద అసోసియేషన్లు రైతులు ఈ యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా అదపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పంట రకం, పంటకోత కాలం ఆధారంగా కారిడార్ నమూనాలో హైటెక్ హార్వెస్టర్ హబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ఉన్న వ్యవసాయయంత్రాల కేంద్రాలు, సేవా ప్రదాతలు, వ్యక్తిగత లబ్ధిదారులు, నమోదిత సంస్థలు, ఎఫ్‌పీఓలు సహా హైటెక్ హార్వెస్టర్ హబ్‌ల ఏర్పాటులో పాల్గొనవచ్చన్నారు. షెడ్యూల్డ్ కులాల రైతులు గరిష్ఠంగా 70శాతం సబ్సిడీకి అర్హులు, సంఘాలు, సంస్థలు ఇప్పటికే ఉన్న వ్యవసాయ యంత్రాల సేవాకేంద్రాలు ఎఫ్‌పీఓలు సహా గరిష్టంగా 70శాతం సబ్సిడీకి గరిష్ఠ సబ్సిడీ రూ.50లక్షలు అర్హులన్నారు. కాంబో హార్వెస్టర్ హబ్‌కోసం దరఖాస్తుచేసుకోవడానికి సంఘాలు, సంస్థలు ఎఫ్‌పీఓలతో సహా ట్రస్టులుమాత్రమే అర్హులు అన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,01,537	1,24,376
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	23,655	1,13,171
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	99.82

నీలకంఠేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

కంప్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కురిహినశెట్టి సమాజ ఆధ్వర్యంలో నీలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం తుంగభద్ర నదిలో గంగపూజలు చేశారు. అనంతరం రంగస్థల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోటూరు రవీంద్రనాథ్, ధర్మకర్త కూనచాగి రవి కుమార్, అర్చకులు వీరబసప్ప, భక్తులు శ్రీనివాస్, అశోక్, బండి వెంకటేష్, మనగూలి రాజశేఖర్, మనగూలి వీరభద్రప్ప, మాదుగొండ శంకర్‌బాబు, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి..



సిరుగుప్ప, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాయమ్మదేవికి శ్రావణ మంగళవారం పూజలు నిర్వహించారు. పట్టణం ఆదోని రోడ్డులో వెలసిన అమ్మవారికి భక్తులు ఎంతో పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాస, నవీన్, ఆకు పూజ, కుంకుమాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద వంపిణీ చేపట్టారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

హాస్టల్ సౌకర్యం కల్పించండి

సిరుగుప్ప, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిగ్రీ కళాశాల విద్యార్థిని రజియా బేగం ప్రభుత్వాన్ని కోరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆదోని తాలుకా బద్నాల్ గ్రామానికి చెందిన రజియా బేగమ్ ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. చిత్రదుర్గ జిల్లాలో డిగ్రీ సీటు లభించింది. హాస్టల్ సౌకర్యం కోసం సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆమె వాపోయారు. తక్షణం ప్రభుత్వం స్పందించి చిత్రదుర్గ మహిళా డిగ్రీ కళాశాలలో హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు.

బహిష్కరణ శిక్షపై హైకోర్టు స్టే

రాయచూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ యువ మోర్చా నాయకుడు రోనాల్డ్ సన్ని అలియాస్ రోనాల్డ్ అగస్టిన్ బహిష్కరణ శిక్షకు కలబుర్గి హైకోర్టు స్టే మంజూరు చేసింది. రోనాల్డ్ అగస్టిన్ పలు అసాంఘిక కార్యకలాపాలకు బాధ్యుడని స్థానిక వెస్ట్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపించిన జిల్లా సహాయ కమిషనర్ ఆయనకు బహిష్కరణ శిక్ష విధించారు. చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలోని రామపుర గ్రామంలో శిక్ష పూర్తయ్యే వరకు ఉండాలని జిల్లాలోకి ప్రవేశించరాదని ఆంక్షలు విధించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించిన అగస్టిన్‌కు స్టే లభించింది. విచారణను 21వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు మంగళవారం ప్రకటించింది.

పిడుగుపడి కాడెద్దుల మృతి



ఎద్దుల కళేబరాలు

కంప్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా తోరణగల్లు మండల ఎం లక్కలపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం పిడుగుపడి పంపాపతి అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు మృతి చెందాయి. ఉదయం పొలంలో ఎద్దులను కట్టివేశారు. ఇంటికి రాగానే అంతలోనే ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. పిడుగుపడటంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. రెవెన్యూ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

లబ్ధిదారుల సమస్యలను వినాలి

● హామీ పథకాల అథారిటీ వైస్ చెర్మన్ మెహ్రోజ్ ఖాన్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మెహ్రోజ్ ఖాన్

బళ్లారి సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాల్లో అర్హులైన లబ్ధిదారుల సమస్యలను వినడం ద్వారా గ్రామీణ ప్రజలకు, పేదలకు సక్రమంగా వాటి ఫలాలు అందించాలని రాష్ట్ర హామీ పథకాల అమలు అథారిటీ వైస్ చైర్మన్ మెహ్రోజ్ ఖాన్ అన్నారు. హొసపేట నగరంలోని పంచాయతీ హాల్లో నిర్వహించిన హామీ అమలు కమిటీ సంప్రదింపుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్రంలో హామీ పథకాలను సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు పథకాలు అందుబాటులో ఉండటం వాస్తవమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సమస్యల కారణంగా అర్హులైన వారుపథకాలను పొందలేకపోతే, అటువంటి సమస్యలకు పరిష్కారాలను అందించడానికి కమిటీ సభ్యులు త్వరగా స్పందించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో 8007 మంది యువత యువనిధి పథకం కింద నమోదు చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా విజయనగరం జిల్లానుంచి యువనిధి అబ్ధిదారులకు నైపుణ్య ఆధారిత శిక్షణ అందించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. బ్యాంక్ సమస్యలపై లీడ్‌బ్యాంక్ మేనేజర్‌కు వివరిస్తామని పంచాయతీ సీఈఓ మహ్మద్ అలీ అక్రమ్ షా తెలిపారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారుల సంఘం ఉపాధ్యక్షులు శంతనగౌడ, జాందీసాహెబ్, సభ్యు భాగ్యలక్ష్మి, ఎర్రిస్వామి, వెంకటరమణ,ప్రభాకర్, షేక్ మహ్మద్ జిలాన్, గురు బసవరాజ్,దేవరాజ్, కేకేఆర్‌టీసీ అధికారి రాజశేఖర్, జెస్కామ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలి

● బాలల సంరక్షణాధికారి చన్నబసప్ప



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చన్న బసప్ప

బళ్లారి సిటీ,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బాలల సంరక్షణ అధికారి చన్నబస్ప పాటిల్ సూచించారు. జిల్లా బాలల రక్షణ యూనిట్, హెల్ప్‌లైన్, పోలీసు విద్యాశాఖల సహకారంతో నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని గాలిబ్ హైస్కూల్లో మంగళవారం బాల్యవివాహాలు, పోక్సో చట్టం, మూఢనమ్మకాలు ,బాలల హక్కుల రక్షణపై నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్న తల్లితండ్రుల్లో మరింత అవగాహన కల్పించి వివాహాలు చేస్తున్న పూజారులు, చర్చి ఫాదర్లు, ఆలయ పూజారులు వివాహ పత్రాలను ముద్రించే ప్రింటింగ్ ప్రెస్‌లు, సంగీత బృందాలు, షామియానా సరఫరాదారులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, పాల్గొన్న ఇతర వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యురాలు సీలోఫియా మాట్లాడుతూ బాల్యవివాహాల గురించి పిల్లల్లో అవగాహన పెంచాలన్నారు. బాల్యవివాహాలకు గురైన బాలికలు ఎదుర్కొంటున్న కష్టాలు, తల్లిదండ్రులపై తీసుకోగల చట్టపరమైన చర్యలు బాల్యవివాహం తర్వాత పిల్లల గర్భధారణ కేసులతో పోక్సో చట్టాన్ని ఎలా అన్వయించవచ్చో విద్యార్థులకు వివరంగా వివరించారు.

సీఎం వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి

● ఆశావర్కర్ల సంఘం డిమాండ్



పత్రికా భవన్‌లో పోస్టర్లు విడుదల చేస్తున్న ఆశావర్కర్లు

బళ్లారి సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కర్ణాటక యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల అమలు కోసం 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు జిల్లాస్థాయిలో ధర్నా చేపట్టినట్లు వారు తెలిపారు. నగరంలోని పత్రికాభవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగలక్ష్మి మాట్లాడారు. గత పదేళ్లలో 20 మంది ఆశాలను ఫెసిలిటేటర్లుగా నియమించి ఆ తరువాత అకస్మాత్తుగా వారిని తొలగించారన్నారు. 60 నిండిన వారిని బలవంతంగా పదవీ విరమణ చేయించారన్నారు. 17సంవత్సరాలుగా సేవలందించినా ఎటువంటి పరిహారం ఇవ్వకుండా వీధుల్లోకి నెట్టడం సరికాదన్నారు. ప్రస్తుతం 41,000 మంది ఆశాలు పనిచేస్తున్నారన్నారు. జనవరి 10న ఆశావర్కర్ల సమావేశంలో ఏప్రిల్ 2025 నుంచి వర్కర్లకు ప్రోత్సహకంతో పాటు ప్రతి నెలా కనీసం రూ.10,000 గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. అంగన్‌వాడీ, హాట్ మీల్ వర్కర్లకు పెంచినట్లే ఆశావర్కర్లకు కూడా పెంచుతామన్నారని గుర్తు చేశారు. ఆశావర్కర్ల వేతనం రూ.10,000కి పెంచారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోదు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే ఎరువులను విక్రయించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎరువుల అమ్మకాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని రాష్ట్ర రైతు సంఘం గ్రీన్ ఆర్మీ తాలుకా అధ్యక్షుడు వీరేష్ కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ మంజునాయక్‌కు ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మిగనూరు గ్రామంలో వ్యాపారులు ఎరువులు విక్రయించేందుకు రైతుల నుంచి భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆధార్, సంతకం చేసి ఖాళీ బాండ్ పేపర్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆయన అన్నారు. ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువగా ఎరువులు అమ్ముతున్నారని ఆరోపించారు. ఈవిషయంపై వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వ్యాపారుల తరఫున మాట్లాడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు ఎరువుల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ మాట్లాడుతూ తాలుకాలో ఎరువుల కొరత సృష్టించవద్దని, నిర్దేశించిన ధరకు వాటిని విక్రయించాలని, నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం తాలుకా అధ్యక్షుడు నాయక, తిమ్మప్ప కొట్టూరు రమేష్, చల్లా వెంకటనాయుడు, ఆదోని రంగప్ప, కేగె ఈరన్న, శ్రీధర, గాదిలింగప్ప, మల్లె జడెప్ప, ఎం.సుమంతస్వామి, కేఎం అడివయ్యస్వామి, రాజాసాబ్, బురెడ్డి బసవరాజు పాల్గొన్నారు.

కేఎస్ ఆర్టీసీ సమ్మె విజయవంతం

బళ్లారి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్టీసీ కార్మికులు డిమాండ్ సాధన కోసం మంగళవారం చేపట్టిన సమ్మె విజయవంతమైంది. సమ్మెకారణంగా బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ప్రయాణికులంతా బస్సులు లేక ఇబ్బందిపడ్డారు. ప్రైవేటు బస్సులు, ఆటోలలో ప్రయాణించాల్సి వచ్చింది.



డిపోకే పరిమితమైన బస్సులు



రాయచూరు బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ప్రయాణికుల పాట్లు

రాయచూరు: డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం విజయవంతమైంది. సిబ్బంది సమ్మెకు దిగిన విషయం తెలియని ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు నగరంలోని నగరంలోని సెంట్రల్ బస్ స్టేషన్‌కు చేరుకుని ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్సుల బంద్‌తో ప్రయాణికులు తప్పని పరిస్థితుల్లో ప్రవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. దీన్ని అదనుగా తీసుకున్న ప్రవేటు వాహనదారులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పలువురు ప్రయాణికులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న హులిగప్ప తదితరులు

8న ఫ్రీడం పార్కు వద్ద నిరసన

బళ్లారి సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయకపోతే ఆగస్టు 6న బెంగళూర్‌లోని ఫ్రీడం పార్కులో నిరసన తెలుపుతున్నట్లు మాదిగ దండోర నాయకుడు హులుగప్ప తెలిపారు. నగరంలో మంగళవారం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల్లో మాదిగ సమాజానికి అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించి ఏడాది గడిచినా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య పదేపదే కమిషన్లు, కమిటీలను ఏర్పాటు చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. జస్టిస్ సదాశివన్ కమిషన్, కాంత్‌రాజ్ కమిషన్ సమర్పించిన నివేదికలోని డేటాను పరిగణంలోకి తీసుకొని, మాదిగ సమాజానికి అంతర్గత రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. దుర్గప్ప మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వెనుకబడిన వర్గాలు, దళితులకు అనుకూలంగా ఉన్నామని చెప్పుకుంటూ ఇలాంటి పొగడ్తల ప్రకటనలు చేయడం మానేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాలలో మాదిగలకు అంతర్గత రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలిని డిమాండ్ చేశారు. దండోరా కమిటీ జిల్లా అధ్యక్షుడు నెటప్ప, వీరస్వామి, చంద్రప్ప, శంక్రప్ప, సుంకప్ప, మల్లికార్జున, గంగాధర్, మహంతేశ్, శేఖర్‌తో పాటు మాదిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా రామాంజిని



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రూపనగుడి ప్రాథమిక హిరియ పాఠశాల అధ్యక్షుడిగా రామాంజిని, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మీలను సోమవారం స్కూలు ఆవరణంలో తాలుకా మాజీ పంచాయతీ సభ్యులు హావళిగి గోవిందప్ప, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షులు నాగరాజుతో పాటు 16మందిని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, సహకార బ్యాంకు అధ్యక్షులు నారాయణ స్వామి, ఎస్‌డీఎంసీ సభ్యులు శంకరప్ప, శివలింగ, మల్లికార్జున, దిల్షాద్ బేగం, దాదాపీర్, హనుమంతు, నాగరాజు, రమేష్, రామకృష్ణ, ఉమాదేవి, శిల్ప, శర్మస్, లక్ష్మి, శశికళ, ఈరమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

సంచార జాతులు ఆర్థికంగా ఎదగాలి



రోడ్‌షోలో ఎమ్మెల్యే మంజునాథను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

బళ్లారి రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బౌద్ధ, సంచార జాతుల వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని కోలార్ ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ అన్నారు. సోమవారం సాయంత్రం సిరుగుప్ప తాలుకా హాశేకోట రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ముందుగా బౌద్ధ, సంచార జాతులు నిర్మించిన కరియప్ప తాత దేవస్థానంలో మొక్కులు తీర్చుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించి బౌద్ధ, సంచార జాతులతో బెంగళూరులో సమావేశమవుదామన్నారు. అనంతరం సీఎం సిద్దరామయ్యతో కలిసి సమస్యలు విన్నవిద్దామన్నారు.

రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బీజేపీ నాయకులు

కంప్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు, పండ్లు బీజేపీ కార్యకర్తలు పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షుడు సీడీ మహదేవ మాట్లాడుతూ తమ నాయకుడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రెండు విడతల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. జిల్లాలోనూ, నియోజకవర్గంలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు. అంతకుముందు ఉద్భవ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కురుగోడు పట్టణంలో కూడా బీజేపీ కార్యకర్తలు దొడ్డ బసవేశ్వర ఆలయంలో పూజలు చేశారు. కేక్ కట్‌చేసి సురేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. వీరేష్, బ్రహ్మయ్య, పురుషోత్తం, వీఎల్ బాబు, సుదర్శన్‌రెడ్డి, దేవేంద్ర, నాగేంద్ర, కేశవ, వీరన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కారును అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

● ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం

రాయచూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన విధాన పరిషత్ సభ్యుడు శరణగౌడ పాటిల్ బయ్యాపూర్ కారును అదే పార్టీకి చెందిన కార్యకర్తలు అడ్డుకున్న సంఘటన మంగళవారం జిల్లాలోని లింగసుగూరు వద్ద చోటు చేసుకుంది. వ్యవసాయ శాఖ గోదామును ప్రారంభించిన ఎమ్మెల్సీ తిరిగి వెళ్లేటప్పుడు ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రారంభోత్సవ సభలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్ పట్ల ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంగా కార్యకర్తలు కారును అడ్డగించినట్లు తెలిసింది. కాగా కారును అడ్డుకున్న కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే డీఎస్ హూలగేరి వర్గానికి చెందిన వారుగా ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఇరువర్గాలు ఈ సందర్భంగా పరస్పరం వాగ్వాదానికి దిగి తోపులాడుకునే స్థితికి రాగా కొంతమంది చొక్యం చేసుకుని ఘర్షణను నివారించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



ఎమ్మెల్సీ శరణగౌడ పాటిల్‌ను అడ్డుకుంటున్న కార్యకర్తలు

హోసూరు జోన్

బాస్కెట్‌బాల్ పోటీలకు అంతరాయం

● ఇరుజట్లకు ట్రోఫీ ప్రదానం



ఇరుజట్లకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యాలు

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు వర్షం కారణంగా అంతరాయం కలిగింది. దీంతో రెండుజట్లు బహుమతిని పంచుకున్నాయి. కృష్ణగిరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు కృష్ణగిరి జిల్లా స్పోర్ట్స్ మైదానంలో జరిగాయి. చెన్నై, కోయంబత్తూరు, కరూర్, ధర్మపురి, హోసూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, సేలం, నైవేలి, తిరునల్వేలి, కృష్ణగిరి సహా వివిధ జిల్లాలనుంచి 24 ప్రముఖ జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. ఫైనల్‌మ్యాచ్‌ను ఎమ్మెల్యే అశోక్‌కుమార్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వర్షం కారణంగా ఆట ఆగిపోయింది. ఫైనల్‌మ్యాచ్ రెండు జట్లకు 1-0 తేడాతో విజయం సాధించిందని రిఫరీలు ప్రకటించారు. చెన్నై పోలీస్ జట్టు, కృష్ణగిరి జట్టుకు ట్రోఫీ, ప్రైజ్‌మనీని ప్రదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణగిరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గిల్బర్ట్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి రాఘవేంద్రన్, కేశవన్, అజి, అరివళగన్, వెంకటాచలం, కౌన్సిలర్ మాదేశ్, మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా సీఎం స్టాలిన్ శిబిరాలు

హోసూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం స్టాలిన్ పేరిట వైద్య శిబిరాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. కార్పొరేషన్ పరిధిలోని 4, 5, 6 వార్డులలు, హోసూరు పంచాయతీ యూనియన్ కెలవరపల్లి, కోలదాసపురం, నందిమంగలం, పలవనపల్లి, ముత్తలి, పంచాయతీలు శూలగిరి పంచాయతీ యూనియన్, అత్తిముగం తదితర ప్రాంతాలలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మేయర్ సత్యతో కలసి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంకే పార్టీ నాయకులు మురుగన్, యు విభాగం కార్యదర్శి శ్రీనివాసన్, గజేంద్రమూర్తి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఎమ్మెల్యే, మేయర్

నగరంలోనూ కేఎస్ ఆర్టీసీ సమ్మె ప్రభావం

హోసూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె ప్రభావం హోసూరు నగరంపైనా చూపింది. కర్ణాటక నుంచి తమిళనాడుకు 200కిపైగా కేఎస్‌ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో 80కుపైగా సర్వీసులు నడుపుతారు. అయితే సమ్మెకారణంగా నామమాత్రంగా కేఎస్‌ఆర్టీసీ బస్సులు వచ్చాయి. దీని ప్రభావం ప్రైవేట్ బస్సులకు ప్రయోజనం కలిగింది. మంగళవారం ప్రైవేట్ బస్సులలో ప్రయాణీకుల సందడి కనిపించింది. కాగా వర్షం కురిసినప్పటికీ బస్టాండ్ వద్ద రద్దీ సాధారణంగానే ఉంది.